



వరద బాధితులకు విరాళం



ప్రజాశక్తి-కందుకూరు : విజయవాడ వరద బాధితులకు సాయం ఇవ్వాలన్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పిలుపుతో విరాళాలు అందించేందుకు పలువురు ముందుకు వస్తున్నారు. టిడిపి సీనియర్ నాయకులు ఆదివారం ఎంఎల్ఎను కలిసి వరద బాధితుల సహాయార్థం 1.25 లక్షల విరాళాన్ని అందజేశారు. కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు వేముల గోపాల్ రావు రూ. 20 వేల చొప్పున విరాళం ఇచ్చారు. ఉలవపాడు మండల టిడిపి అధ్యక్షులు రాచగిరి సుబ్బారావు, ఉలవపాడు మండలం కష్టపర్తి గ్రామ టిడిపి అధ్యక్షుడు చక్రవర్తుల విజయకుమార్ లు చెరొక 10 వేలు, కందుకూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షుడు వడ్డెళ్ల రవిచంద్ర రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 1.25 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో ఎంఎల్ఎకు అందజేశారు.

ఉద్యోగుల బదిలీలు ఒక భారీ షో..!

ఎంఎల్ఎలు 6 వేల సిఫార్సు లేఖలు - 22 వరకు బదిలీల ప్రక్రియ పాడిగింపు

ప్రభుత్వంలో ఉన్నతాధికారులు ఉత్సవ విగ్రహాలుగా మారి పోయారు.. అధికారపార్టీ ఎంఎల్ఎలకు తెలియకుండా, వారి సిఫార్సులు లేకుండా ఒక్క ఉద్యోగిని కదిలించే అధికారాన్ని వారు కోల్పోయారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాపితంగా ఉద్యోగుల బదిలీల కోసం గత నెల 30 వరకు గడువు పెట్టింది. అటు తరువాత ఈనెల 15 వరకు పొడిగించింది. విజయవాడ వరదలు నేపథ్యంలో ఈ ప్రక్రియను ఈనెల 22 వరకు పొడిగించింది... కొన్ని శాఖల అధికారులు బదిలీలు ప్రారంబించారు.కేవలం ఒక షో లాగే కనిపిస్తోంది. జిల్లా వ్యాపితంగా ఎనిమిది నియోజకవర్గాల్లో ఎంఎల్ఎలు సుమారు ఆరు వేల సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. ఒక్కో ఎంఎల్ఎ 600 నుండి 900 వరకు అందించినట్లు సమాచారం. ఈ సిఫార్సులు తప్ప ఒక్క బదిలీ చేయడానికి అధికారులకు ఎలాంటి అధికారులు కనిపించడం లేదు. కేవలం ఉత్సవ విగ్రహాలు తూతూ మంత్రంగా ప్రకియ కొనసాగిస్తున్నారు. ఈ పరిణామాలతో ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు..



నెల్లూరు కార్పొరేషన్‌లో సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ (ఫైల్)

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం గతం కన్న కొత్త సాంప్రాదానికి తెరతీసింది. ప్రభుత్వం మారినప్పుడు ఉద్యోగులు బదిలీలు సర్వసారణమే. మొత్తం మీద 10 నుంచి 20 శాతం అధికారపార్టీ నేతలు సిఫార్సులు చేయడం పరిపాటే. ఏ పార్టీ అధికారంలో ఉన్న ఇది ఇప్పటి వరకు సాగుతూ వచ్చింది. ఎన్‌డిఎ ప్రభుత్వం ఈ విధానాన్ని పూర్తిగా మార్పు చేసింది. ఏ ప్రభుత్వ శాఖలోనైనా అటెండర్ నుంచి జిల్లా ఉన్నతాధికారి వరకు మంత్రులు, ఎంఎల్ఎలు ఇచ్చిన సిఫార్సుల లేఖలు అధికారంగానే బదిలీలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు గడుస్తోంది. గత నెల 30వ తేదిలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సమయం సరిపోకపోవడంతో ఈనెల 15 వరకు గడుపు పెంచారు. విజయవాడ వరదలు నేపథ్యంలో దీనిని 22 వరకు పెంచారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారలందరూ ఆ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేశారని, అందరినీ మార్పు చేసుకొని తమకు అనుకూలమైన రెవెన్యూ, పోలీసుతోపాటు అన్ని శాఖల్లో బదిలీలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. నియోజకవర్గానికి సంబంధించి ఎంఎల్ఎ సిఫార్సుల లేఖల ఆధారంగానే ఉన్నతాధికారులు బదిలీలు చేయాలని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న ఉద్యోగులు జిల్లాలోని అందరూ ఎంఎల్ఎల ఇళ్ల ముందు వాలిపోయారు. గ్రామ, మండల స్థాయి నేతలను తీసుకొని ఎంఎల్ఎల వద్దకు వెళ్లి సార్ మనకు.. అనుకూలంగా పనిచేస్తారు.బదిలీ లేఖ ఇవ్వండి అంటూ సిఫార్సులు చేశారు. ఆయా ప్రాంత నేతలు చెప్పిన వారికి ఎంఎల్ఎలు లేఖలు అందజేశారు. ఎస్ఐ, సిఐ, డిఎస్‌పిలు ఎంఎల్‌ల ఇళ్ల చట్టు తిరిగి తిరిగి లేఖలు సంపాదించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, డిఆర్‌డిఎ, దానిని అన్ని శాఖల ఉద్యోగులు తమకు అనుకూలమై ప్రాంతాలకు లేఖ తీసుకున్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అనేక మంది సుదూర ప్రాంతాలకు పంపాలని నిర్ణయించినట్లు తెలిసింది. జిల్లా ఉన్నతా ధికారుల విషయంలో మంత్రులు, ఎంఎల్ఎలు, జిల్లా టిడిపి నేతలు కూర్చోని సమన్వయంతో జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులు జాబితా పంపారు. నేడో, రేపో జిల్లాఉన్నతాదికారులు బదిలీలు జరుగుతుయని తెలుస్తోంది. 22వ తేదిలోపు అన్ని శాఖల్లో బదిలీలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఉత్తర్యులు అందజేసింది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కొందరు చోటా నాయకులు బదిలీల విషయంలో అవినీతికి పాల్పడినట్లు విమర్శలున్నాయి.

6వేల సిఫార్సు లేఖలు..?

జిల్లా వ్యాపితంగా ఎనిమిది నియోజవర్గాల్లో సుమారు 6 వేల సిఫార్సు లేఖలు ఉద్యోగులకు అందించినట్లు విశ్వసనీయ సమాచారం. నెల్లూరు నగరంలో ఒక ఎంఎల్ఎ ఏకంగా 850 లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. మరో ఎంఎల్ఎ సుమారు 700 వరకు ఇచ్చారు. ఒక్కో ఎంఎల్ఎ 600 నుండి 900 వరకు లేఖలు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. అధికారులు బదిలీలను షో కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇప్పటికే నెల్లూరు కార్పొరేషన్ బదిలీలు జరిగాయి. ఎంఎల్ఎ లేఖలు తెచ్చిన ఉద్యోగులు తాము కొరుకున్న చోట పొస్టింగ్‌లు తెచ్చుకున్నారని సమాచారం. డిఆర్‌డిఎ లోనూ బదిలీల ప్రక్రియ ఇదే తరహాలు సాగింది. చూడానికి బదిలీలు అంటున్నా ఎంఎల్ఎ లేఖ అనుగుణంగానే బదిలీలు సాగుతున్నాయి. ఎక్కడా ఒక్కరికి మార్చడానికి, తమకు అనుకూలమైన వ్యక్తులు ఇచ్చే అధికారం జిల్లాఉన్నతాధికారులకు దక్కడం లేదు. " ఆ అధికారి,,. ఇ అధికారి కావాలనే పరిస్థితల్లో మేం లేము.. వారు ఎవరిని ఇస్తే వారి వద్ద పనిచేయించుకోడమే " అంటూ ఒ పోలీసు అధికారి అసహనం వ్యక్తం చేశారు. " గతంలోనూ ఇలాంటి పరిస్థితులున్నా వంద శాతం ఎంఎల్ఎ సిఫార్సులకే ప్రాదాన్యత ఇవ్వడం ఇదే ప్రదమం అంటూ మరో అదికారి వాపోయారు." ఎవరి అదికారపార్టీతో సంబంధా లుంటే వారికే సిఫార్సు లేఖలు అందాయి. ఉన్నతాధికారులు తమ బదిలీల లేఖల కోసం సిఫార్సుల్లో మునిగి తేలుతున్నారు.ఉద్యోగులు మాత్రం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలా కాదంటూ ఇలా చేయడమేమంటూ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా పోరాటాల యోధుడు 'ఏచూరి'



ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గుంజి దయాకర్ తదితరులు

ప్రజాశక్తి-నెల్లూరు

భారతదేశంలో ప్రజా పోరాటాలు నిర్వహించడంలో సీతారాం ఏచూరి కీలక భూమిక పోషించారని ఎపి చేతి వృత్తిదారుల సమన్వయ సంఘం రాష్ట్ర నాయకులు గుంజి దయాకర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో చేతివృత్తిదారుల సంఘం జిల్లా సమన్వయక కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పలువురు చేతి వృత్తిదారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు గుంజి దయాకర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అన్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజలకు, కార్మికులకు కర్షకులకు వృత్తిదారులకు సీతారాం ఏచూరి లేని లోటు తీర్చలేనిదన్నారు. చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ కిటికాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో నిరంకుశ ప్రజా కంటక ప్రభుత్వాలను గద్దె దింపే పోరాటాల్లో ఆయన కీలకపాత్రను పోషించారన్నారు. వృత్తి సంఘాల జిల్లా నాయకులు రేకుల గుంట అంకయ్య బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు అచ్చి తిరుపాలు సురేంద్ర శేషగిరిరావు శ్రీహరి పాల్గొన్నారు.



వైఎస్ఆర్ నగర్‌లో..

సంతాప సభలో వక్తలు



సీతారాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య తదితరులు

సిపిఎం రూరల్ కార్యాలయంలో : వేదాయపాళెంలోని సిపిఎం రూరల్ కార్యాలయం మన్సూర్‌భవన్‌లో ఇటీవల మృతి చెందిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరికి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆదివారం ఆటోనగర్ ప్రాంతంలోని చెక్కరిక్షా కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు రూరల్ కార్యదర్శి కె.కుమార్, సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య. రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కొండ ప్రసాద్ ఏచూరి సేవలను కొనియాడారు. రూరల్ కమిటీ సభ్యులు డి సంపత్ కుమార్ .ఎం సుధాకర్. అంజిరెడ్డి. కే కష్ణమూర్తి. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఓబుల్ రెడ్డి. ప్రసాద్ . నారాయణ. నరసింహులు ఉన్నారు.

వైఎస్ఆర్ నగర్‌లో..

రూరల్ 30వ డివిజన్ వైఎస్ఆర్ నగంలోని స్థానిక సిపిఎం , ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైయస్సార్ నగర్ శాఖ కార్యదర్శి కండె కోటేశ్వరరావు ,భవన నిర్మాణ సంఘం నాయకులు వాసుదేవరావు, రమేష్ ,శీను, సుధాకర్, చందు ఐద్వా నాయకురాలు రత్నమ్మ ,అనసూయమ్మ ,శాంతి, బీబీజాన్ ,లక్ష్మి పాల్గొన్నారు.

శ్రామికనగర్‌లో.. :రూరల్ 30వ డివిజన శ్రామిక నగర్ ఆటో స్టాండ్ నందు ఆటో కార్మికులు ఆధ్వర్యంలో స్టాండ్ కార్యదర్శి ఎస్ డి హమీద్ కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ సెక్రటేరియట్ సభ్యులు కొండ ప్రసాదు, ఆటో కార్మిక సంఘం రూరల్ కార్యదర్శి ఎం సుధాకర్, రూరల్ కమిటీ సభ్యులు కండె కోటేశ్వరరావు ,కార్యదర్శి ఎస్కే ఖయ్యుమ్ ,ఆటో స్టాండ్ సభ్యులు శీనయ్య, మాసూం, వలి, సతీష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

26వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో..

రూరల్ 26 డివిజన్ శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్స్ కాలనీ బిట్ 1 ఆఫీస్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖ్యఅతిధిగా హాజరైన సీనియర్ పార్టీ సభ్యులు నరసింహారెడ్డి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య ప్రసంగించారు.రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కొండ ప్రసాద్ . రూరల్ కమిటీ సభ్యులు డి సంపత్ కుమార్ . శేషయ్య నాని వెంకటేశ్వర్లు ఎస్.కె షానవాజ్ సిఐటియు, నాయకులు కార్మికులు కార్యకర్తలు ఉన్నారు.



శ్రామికనగర్‌లో..

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు పట్టణర పామూరు రోడ్‌లోని బిఆర్ ఆక్స్ ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్ లో "హిందీ దివాస్" వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14 వ తేదీన హిందీ భాష దినోత్సవం గా జరుపుకుంటారన్నారు. భారత జాతియోద్యమంలో అఖిలభారతాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహద పడినందున గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబర్ 14న హిందీని కేంద్ర ప్రభుత్వం అధికార భాషగా గుర్తిస్తూ పొందుపరచారని తెలిపారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి. బాల భాస్కర రావు,బి. నరేంద్రబాబు, డీన్.రామారావు, ప్రిన్సిపాల్స్.మల్లికార్జున,ఎస్కె.నజీర్,.సునీత ఉన్నారు.



గణేష్ నిమజ్జనంలో 'ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలోని గోకరాజుపాలెంలో ఆదివారం వినాయకుడి నిమజ్జనం, పూజా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన వెంట పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

డిఎస్‌పి శ్రీనివాసరావు బదిలీ

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు డిఎస్‌పిగా పనిచేస్తున్న ఎ శ్రీనివాసరావును గుంతకల్లు డిఎస్‌పిగా బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు శ్రీనివాసరావు కందుకూరి డిఎస్‌పిగా వచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. అయన స్థానంలో కందుకూరు డిఎస్‌పిగా ఎవరినీ నియమించలేదు.

కనుపూరు చెరువు పరిశీలన

ప్రజాశక్తి - వెంకటాచలం : మండలంలోని కనుపూరు చెరువును ఆదివారం సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గానికి రెండుసార్లు ఎంఎల్ఎగా గత వైసిపి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసినటువంటి కాకాణి గోవర్ధన్ రెడ్డి గత ఐదేళ్ల వైసీపీ పాలనతో సర్వేపల్లి నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణి భవాని నాయుడు, జనసేన పార్టీ నాయకులు పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, ఆస్తోటి రవికుమార్, అఖిల్, విష్ణు, రహీం, రెహమాన్ ఉన్నారు.

విశ్రాంత ఇంజినీర్లకు సన్మానం

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక భక్తవత్సలనగర్ వద్దనున్న ప్రభుత్వం పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే ని పురస్కరించుకొని పలువురు ఇంజనీర్లకు ఆదివారం సన్మానం జరిగింది. పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్ఎం గౌస్‌బాషా మాట్లాడారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఈ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను గుర్తించి భారత రత్న అవార్డును అందజేసిందన్నారు. అనంతరం పలువురు ఇంజినీర్లను సన్మానించారు. ప్రభుత్వ పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-నెల్లూరు :ఉపాధ్యావృత్తిలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పిఆర్‌టియు నాయకులును ఆదివారం నగరంలోని పిఆర్‌టియు జిల్లా కార్యాలయంలో సన్మానించారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు డి. వెంకటరాజు, జిల్లా నాయకులు ఎస్‌కె. రఫీ, జి. సైమన్‌కుమార్, ఎల్.సుబ్బారావులకు ఆత్మీ సన్మానం జరిగింది. రాష్ట్ర నాయకులు ఎస్. నాగేంద్ర కుమార్, జిల్లా నాయకులు శ్రీనివాసులు, రవిచంద్ర, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, మునిరజాచార్యులు కిషోర్ ఉన్నారు.

అన్నదానం మిన్న

ప్రజాశక్తి -వలేటివారిపాలెం :మండలంలోని చుండిలో గత తొమ్మిది రోజుల నుంచి గణనాధునికి పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నిమజ్జనం సందర్భంగా చెరువుపల్లి సాంబయ్య ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నదాన చేపట్టారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీ నరసింహ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి మాజీ చైర్మన్ చెరుపల్లి మాల్యాద్రి పెగడ శ్రీనివాసులు ఉన్నారు.

కంటైనర్ టెర్మినల్ ప్రారంభించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్‌కుమార్



ప్రచార జాతాలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

అదాని కష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ ను తిరిగి పున: ప్రారంభించాలని ముత్తుకూరు ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్లో ప్రచార జాత కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ జాతాలో ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టు మొదట దశలో మూడు బెర్తుల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాన్నారు. ఆ అనుమతుల్లో కంటైనర్ టెర్మినల్‌కు సంబంధించిన ప్రస్తావన లేదన్నారు. రెండవ దశ విస్తరణకై 4-4-2008న భారత ప్రభుత్వ పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ ఫైల్ నెంబర్ 10-22/2005 1ఏ -111 ద్వారా 14 బెర్తులు నిర్మాణానికి అనుమతులు వచ్చాయన్నారు. ఎనిమిది కంటైనర్ టెర్మినల్ నిర్వహణకే పోర్టు మూడవ దశ విస్తరణకై తేదీ 11-01-2 021న అదే మంత్రిత్వ శాఖ ఫైల్ నెంబర్ 10-18/2016 1ఏ-111 ద్వారా 16 బెర్తులుకు అనుమతులలో నాలుగు బెర్తులు కంటైనర్ రవాణా కి మొత్తం మీద 33 బెర్తులకు నిర్మాణం అనుమతులు లభించాయన్నారు. అయితే 14 బెర్తులు కంటైనర్ టెర్మినల్ కి కష్ణపట్నం పోర్టుకు 2005-26 నాటికి సంవత్సరానికి 55 లక్షల కంటైనర్ బాక్స్ ల ట్రాఫిక్ ఉంటున్నదని అంచనా వేసుకోని అందుకు తగిన విధంగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నారన్నారు. వీటి నిర్వహణకు సుమారు 1160 ఎకరాలు భూమిని ప్రభుత్వం నుండి కేటాయింపు లభించిందన్నారు. ప్రస్తుతం ఆ భూమి మొత్తాన్ని బొగ్గు ఐరన్ వారు నిల్వచేసినందుకు వేల కోట్ల వ్యాపారం చేసుకునేందుకు అదాని ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. 6800 ఎకరాలను ఇచ్చి ఐదు గ్రామాల ప్రజలు ఉన్నచోట నుండి తరలి వెళ్ళిపోయి నిర్వాసితుల త్యాగం ఎందుకూ పనికి రాకుండా పోయిందన్నారు. ఈ తరుణంలో కంటైనర్ టెర్మినల్ మరో ప్రాంతానికి తరలించడం దారుణమన్నారు. పభుత్వం స్పందించి తరలించిన కంటైన టెర్మినాలను కష్ణపట్నం పోర్ట్ లో కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఈ నెల 22వ తేదీ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ముత్తుకూరు బజార్ సెంటర్లో కంటైనర్ టెర్మినలపై బహిరంగ సభ జరుగుతుందన్నారు. అనంతరం కష్ణపట్నం పారిశ్రామిక క్లస్టర్ కార్యదర్శి గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ కంటైనర్ టెర్మినల్ సాధనకై రేపటి నుంచి మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో ప్రచార జాత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలు, 22వ తేదీ ముత్తుకూరులో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లాడి గోపాల్ కష్ణపట్నం పారిశ్రామిక క్లస్టర్ అధ్యక్షులు గడ్డం అంకయ్య సిఐటియు మండల కార్యదర్శి గోడ భాస్కర్ మండల కోశాధికారి కె నాగరాజు నాయకులు నక్కా శ్యాంప్రసాద్ పద్మమ్మ పార్వతి తదితరులు పాల్గొన్నారు

కల్వర్టు ధ్వంసంపై ఫిర్యాదు..

పురోగతి లేదన్న దళిత కాలనీవాసుల



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకులు

ప్రజాశక్తి-కందుకూరు

గత నాలుగు రోజులుగా ఓగూరు ఎస్‌సి మాదిగ పాలెంలో కల్వర్టు ధ్వంసం విషయం చిలికి చిలికి గాలి వానగా మారిన పరిస్థితి కనపడుతుంది. అగ్రవర్ణాల వారు కల్వర్టు కూల్చారని ఎస్‌సి మాదిగ పాలెం గ్రామస్తులు కొంతమంది సబ్ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. రూరల్ పోలీసులకి కూడా ఫిర్యాదు చేశారు. ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వైసిపికి చెందిన దళితులు అరోపించారు. ఈ విషయాన్ని ఎస్‌సి కాలనీ టిడిపి నాయకుడు రాయపాటి శ్రీను భుజాన వేసుకొని అగ్రవర్ణాల వారిని కాపాడే విధంగా వ్యవహరిస్తూ ఎస్‌సి కాలనీ వాసుల పైనే అసత్య ఆరోపణ చేశారని, దీనిని ఖండిస్తూ వివరణ ఇచ్చిన కరేటి చిన్న కోటేశ్వరరావు ఇంటిపై ఆదివారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని వైసిపి నేతలు తెలిపారు.. ఈ దాడిలో చిన్న కోటేశ్వరరావు కుమారులు ఇరువురు కూడా తీవ్రంగా గాయపడి ఏరియా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో చేరినట్లు తెలిపారు. రూరల్ పోలీసులు వెళ్లి విచారించి రిపోర్టు స్వీకరించారు. తనపై దాడి చేసి కొట్టి గాయపరిచిన వారిలో కోటేశ్వరరావు తెలిపిన విధముగా పోలిపోగు వాసు, రాయపాటి శ్రీను, రాయపాటి. పుల్లయ్య, బాణాల. సాల్మన్, పోలిపోగు. రాఘవులు, రాయపాటి. బాల వెంకటేష్, పోలిపోగు. మనోజ్ తదితరులు ఉన్నారని తెలిపారు. అధికారులు స్పందించి కల్వర్టు కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకొని, ఎటువంటి సంబంధం లేకుండా మాపై దాడి చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు

వ్యసనాలకు బానిసలై దొంగతనాలు చేయడాన్ని మార్గంగా చేసుకోని చోరీలకు పాల్పడి పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్న నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు రూరల్ డిఎస్‌పి జి.శ్రీనివాసులు తెలిపారు. ఈ మేకు ఆయన ఆదివారం నగరంలోని రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుడి అరెస్టు, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న విధానాన్ని మీడియాకు వివరించారు. విడవలూరు మండలం, వావిళ్లకు చెందిన మడపర్తి సతీష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకోవడంతోపాటు అతని వద్ద నుంచి రూ.17 లక్షల విలువ చేసే 35 సవర్ల బంగారు ఆభరణాలు,వందగ్రాముల వెండి సామాను, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు నేరచరిత్ర కలిగిన వాడే అని, ఇతనిపై విడవలూరు, బుచ్చి,సంగం, ఇందుకూరుపేట పోలీసు స్టేషన్లలో పలు కేసులు నమోదు అయినట్లు తెలిపారు. ఈ ఏడాది మే నెల 14వ తేదిన జైలు నుంచి విడుదలై బయటకు వచ్చిన మడపర్తి సతీష్‌కుమార్ ఆమంచర్ల గ్రామంలో ఒరుపల్లి అశోక్‌కుమార్, వారి కుటుంబ సభ్యులు రాత్రి ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో దిండు కింద ఉన్న ఇంటి తాళాలను తీసుకోని లోపలికి వెళ్ళి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించి పారిపోయినట్లు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. తెలిపారు. జూలై 24వ తేదిన ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో, ఆగష్టు 29వ తేదిన వి.సత్రం మండలం , కసుమూరు గ్రామంలో , ఈ నెల 12వ తేదిన ఆర్‌టిసి బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలి బ్యాగ్‌లోని బంగారు ఆభరణాన్ని దొంగిలించి పారిపోయినట్లు కేసులు నమోదు అయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు, సిసిఎస్ పోలీసుల సహకారంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొనేందుకు ప్రతిభను కనపరిచిన పోలీసు సిబ్బందికి రివార్డులు ప్రకటించారన్నారు.

22న ఒంగోలులో సభ

ప్రజాశక్తి-కందుకూరు :ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పును గౌరవ సుప్రీంకోర్టు పునః పరిశీలించి రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 22న ఆదివారం సాయంత్రం ఒంగోలు అంబేద్కర్ ఓపెన్ ఆడిటోరియంలో జరిగే ఉమ్మడి ప్రకాశం జిల్లా సభను జయప్రదం చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంగళరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన అంబేద్కర్ విగ్రహం వద్ద సభ తాలూకా కరపత్రాన్ని ఆవిష్కరించారు. దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్రఅధ్యక్షులు సుదర్శి. శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడారు. కందుకూరు నియోజకవర్గ మాల మహాసభ అధ్యక్షులు చనమాల.వెంకటేశ్వర్లు, మాల మహానాడు నాయకులు పాలేటి. కోటి ,చానమాల. శ్రీధర్, బొట్లగుంట శ్రీను ఉన్నారు.

22న నారా లోకేష్ ఆరోగ్య రక్ష

పేదల కోసం భారీ వైద్య శిబిరం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన నియోజవర్గ ప్రజల కోసం నారా లోకేష్ ఆరోగ్య రక్ష పేరుతో భారీ ఆరోగ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈనెల 22న నియోజకవర్గంలోని దేవరపాళం నుంచి ప్రారంబిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆదివారం తన కార్యాలయంలో తన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కన్వీనర్ చక్రవర్దన్‌రెడ్డితో కలిపి లోగోను ఆవిష్కరించారు. తన నియోజకవర్గంలోని పేదలకు ఉచిత వైద్య అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నానని, తొలిత నగరం, గ్రామాల్లోని అన్ని ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నటుల తెలిపారు. అంతకు ముందు కార్యక్రమం కన్వీనర్ చక్రవర్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ ఆదివారం నరసింహకొండ లో నరసింహస్వామి పాదాలచెంత ఈ కార్యక్రమాన్ని పారంభి స్తున్నామన్నారు. పేదలకి అందుబాటులో కార్పొరేట్ హాస్పిటల్స్ వైద్యులతో వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్పోరేట్ ఆసుపత్రుల సిబ్బంది ప్రజల వద్దకు వెళుతారన్నారు. తొలిత అన్ని గ్రామాలు,పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే హాస్పిటల్ లో కార్పోరేట్ స్దాయి వైద్య సేవలు అందిస్తామన్నారు. రాష్ట్రంలో అప్పటి వైసిపి ప్రభుత్వాన్ని ఎదుర్కొని యువగళం నిర్వహించిన లోకేష్ పేర ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

రాజా గౌతమ్‌కు ఉత్తమ ఇంజినీరింగ్ అవార్డు

ప్రజాశక్తి -నెల్లూరు :భారతరత్న డాక్టర్ మోక్షగుండం విశేశ్వరయ్య జయంతిని పురస్కరంచుకుని ఇంజనీర్స్ డేను ఆదివారం తిరుపతిలోని పద్మావతి మహిళ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించారు. ఆధునిక నిర్మాణ రంగంలో సాంకేతికత - సూచనలు అన్న అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో బుద్ధా ప్రాజెక్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ కనస్ట్రక్షన్స్ ఇంజనీర్ రాజా గౌతమ్ ఉత్తమ ఇంజనీరింగ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆ అవార్డును ఐఐటి తిరుపతి సివిల్ ఇంజనీర్ డిపార్ట్మెంట్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ మురళీకష్ణ చేతుల మీదుగా రాజా గౌతమ్ అందుకున్నారు.



అవార్డు రావడం సంతోషం..

బుద్ధా ప్రాజెక్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ కనస్టక్షన్స్ ఇంజనీర్ రాజా గౌతమ్ ఉత్తమ ఇంజనీర్ - 2024 అవార్డుకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని సంస్థ హెడ్ బిఎన్ రాజు తెలిపారు. ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు.



మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

ఎంఎల్ఎపై మాలేపాటి ఆరోపణలు

ప్రజాశక్తి-కావలి

దగదర్తి మండలంలో మాలేపాటి బ్రదర్స్‌కు తెలియకుండా ఏ పని జరుగదని ఎన్నికల ప్రచారంలో కార్యకర్తల సమావేశంలో మాట ఇచ్చిన కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి నేడు మాట తప్పి గతంలో వైసిపి వాళ్ళు శంకుస్థాపన చేసిన దగదర్తి - బుచ్చి రోడ్డు పనులను ప్రారంభించారని టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాలేపాటి సుబ్బానాయుడు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని రైల్వే రోడ్డులో ఉన్న "జర్నలిస్టు క్లబ్"లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టిడిపి ప్రారంభించిన 1982 నుంచి తమ కుటుంబం తమ తండ్రి నుంచి తర్వాత తమ అన్నదమ్ముల వరకు టిడిపిలోనే ఉన్నామని ఇప్పటికీ 9 అసెంబ్లీ ఎన్నికలను పార్టీ అభివృద్ధికి కృషి చేసి ఎన్నో ఆటుపోట్లు కొట్లాటలు కేసులు పైనపడ్డ విజయవంతంగా పార్టీని ముందుకు నడిపించుకుని గెలిపించుకున్నామని తెలిపారు. కానీ ప్రస్తుతం ఎన్నికల్లో గెలిచి, దగదర్తి మండలంలో 'ఒకనాడు చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేశారన్న వార్తతో వీధివీధి తిరిగి టపాసులు కాల్చి, టిడిపిని ఎగతాళి చేసిన వైసిపి నాయకులను చేరదీసి, ఇప్పుడు తమను దూరం పెట్టారని వాపోయారు. తన ప్రాణం ఉన్నంత వరకూ టిడిపి అభివృద్ధి కోసమే కృషి చేస్తానని తెలిపారు. దగదర్తి - బుచ్చి రోడ్డు శంకుస్థాపన ప్రారంభోత్సవానికి తనను పిలవలేదని విలేకరులడిగిన ప్రశ్నకు జవాబుగా తెలిపారు. దగదర్తి మండలంలో తన మండలంలో తనను సంప్రదించకుండా తనకు తెలియకుండా ఎన్నో పనులు చేస్తున్నారని, 2024 అసెంబ్లీ ఎన్నికలలో తనకు వ్యతిరేకంగా పని చేసిన వారిని వేరే పార్టీల నాయకులను కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ త్వరలో అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లనున్నానని తెలిపారు. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా తాను కట్టుబడి ఉంటానని తెలిపారు. కావలి నియోజవర్గంలో టిడిపిని కష్టకాలంలో నిలబెట్టి, 16 కేసులను ఎదుర్కొంటున్నానని మాలేపాటి అన్నారు. కానీ పార్టీ కోసం కష్ట పడిన తమకు తగిన గౌరవం దక్కడం లేదన్నారు. ఎప్పుడో వైసిపి అధికారంలో శంకుస్థాపన చేసిన రోడ్డుకు మళ్లీ, శంకుస్థాపన అంటే హాస్యాస్పదమన్నారు. ఏదేమైనా తాను హైకమాండ్ చంద్రబాబు నాయుడు, లోకేష్ దగ్గరే తేల్చుకుంటానన్నారు. గత 5 సంవత్సరాలుగా తమకు అండగా ఉండి, పార్టీ గెలుపునకు సహకరించిన జర్నలిస్ట్ క్లబ్ సభ్యులకు తాను ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.


నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

పేదలకు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-వరికుంటపాడు

గ్రామీణ ప్రాంతాలలోని పేదలకు స్వచ్ఛంద సేవ సంస్థ తరుపున చేయూత అందంచడం అభినందమని ఆదర్శ సేవా సంస్థ చైర్మన్ బక్క ఆదెయ్య అన్నారు. మండలంలోని తూర్పు చెన్నంపల్లిలో ఆదర్శ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయంత్ర పాఠశాలలో ఆత్మకూరు పట్టణానికి చెందిన ఏడ్నామ్మా మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకుడు బక్క ఎలీషా ఆదివారం పేదవిద్యార్థులకు కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులను కొంతమేర అందించారు. చిన్నారుల తల్లితండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న దామిశెట్టి సుధీర్‌నాయుడు

స్ఫూర్తి ప్రదాత 'మోక్షగుండం'

ప్రజాశక్తి-కావలి

ఇంజనీరింగ్ విద్యార్థులకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తి ప్రదాత, మార్గదర్శకుడని డి.బి.ఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15న మోక్షగుండం విశ్వేశ్వరయ్య గౌరవార్ధం ఆయన పుట్టిన రోజుని ఇంజినీర్ల దినోత్సవంగా (ఇంజనీర్స్ డే) జరుపుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కావలి డి.బి.ఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి. సుధీర్ నాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సుప్రసిద్ధ ఇంజనీర్‌గా ప్రసిద్ధి చెంది, భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయంగా ఇనుమడింప చేశారని, ఆయన భారతదేశంలో అనేక నదులపై ఆన కట్టలు, వంతెనలు కట్టి, నీటి పారుదల, తాగునీటి పథకాల ద్వారా జలవనరుల సద్వినియోగం ద్వారా మహోన్నత ఖ్యాతిని ఆర్జించారన్నారు. ఆయన మైసూర్ బృందావన ఉద్యానవనం, భద్రావతి ఇనుము, ఉక్కు కర్మాగారం, బ్యాంక్ ఆఫ్ మైసూర్ స్థాపనలో కీలకపాత్ర పోషించారని తెలియ జేస్తూ ఇటువంటి మహోన్నత వ్యక్తిని ఈ రోజు స్మరించుకోవడం మనందరి కర్తవ్యంగా భావించాలని ఉద్బోదించారు. ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని గొప్ప ఇంజినీర్‌గా ఎదగాలని సూచించారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ రంగంలో భారతదేశ మౌలిక సదుపాయాల వృద్ధిని గణనీయంగా ప్రభావితం చేసిన గొప్ప మార్గదర్శకుడని తెలియజేశారు. కార్యక్రమంలో కావలి జన విజ్ఞాన వేదిక కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, సహాయ కార్యదర్శి మురళీ కృష్ణ, పరిపాలన అధికారి జి.రమేష్‌బాబు, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

25న టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలం లో 25న పాఠశాల స్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు గడ్డంవారిపల్లి ఉన్నత పాఠశాల సైన్సు ఉపాధ్యాయుడు షేక్ కరీముల్లా హుస్సేన్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు 8, 9, 10 తరగతుల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియం పరీక్ష రాసే విద్యార్థులకు ఆయా పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు పరీక్షా పత్రాలు కావాల్సిన వివరాలను 20వ తేదీలోగా తెలియజేస్తే జిల్లా శాఖ నుండి తెప్పించి అందజేస్తామన్నారు. ఫోన్ 9573264270 నెంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.



'పిఎంశ్రీ'తో పాఠశాలల్లో సౌకర్యాలు

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యార్థిని విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం తాము ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు 'పిఎం శ్రీ' పేరుతో సరికొత్త పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో దేశ వ్యాప్తంగా దాదాపుగా 14 వేల స్కూళ్లను ఎంపిక చేసి ఆధునిక వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులను నేరుగా అందజేస్తుంది. అటువంటి పథకం ద్వారా పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించుకొనేందుకు జిల్లాలో 42 పాఠశాలలు అవకాశం దక్కింది. ఈ పథకం ద్వారా పాఠశాలల్లో ఎటువంటి పనులు నిర్వహిస్తున్నారో ఎస్ఎస్ పిఒ సిహెచ్ ఉషాలక్ష్మి మాటల్లో...



ప్రశ్న. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యత పాఠశాలలుగా మార్చడానికి అవసరమైన నిధులు అందజేసేందుకు ప్రకటించిన 'పిఎం శ్రీ' అను సరికొత్త పథకం జిల్లాలో ఎన్ని పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు ఏయే పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలి..?

జవాబు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'పిఎం శ్రీ' పథకం ద్వారా లబ్ధి పొందేందుకు జిల్లాలోని 42 పాఠశాలలు ఎంపికైయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలోని పాఠశాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హత కలిగి ఉంటాయి. దరఖాస్తు చేసుకున్న పాఠశాలల ఎంపిక మూడంచెల ప్రక్రియలో ఉంటుంది. నిర్దేశించిన ఫార్మాట్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎంపికైన పాఠశాలకు జియో ట్యాగింగ్ చేసి కార్యకలాపాలను సమీక్షిలు నిర్వహిస్తారు. ఏడాదిలో నాలుగు సార్లు మాత్రమే ఈ పోర్టల్ ఓపెన్ అవుతుంది. ఆ సమయంలో మాత్రమే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోనే పాఠశాలలు పక్కా భవనం, బాలబాలికలకు వేరు వేరు టాయిలెట్లు, నీరు, విద్యుత్తు సౌకర్యం వంటివి ఖచ్చితంగా ఉండాలి. జిల్లాలో ఎంపికైన 14 పాఠశాలల్లో కెమెస్ట్రీ ల్యాబ్స్ ఏర్పాటు, 37 పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన మేరకు క్రీడామైదానాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పనులను ఆయా మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారి-2 పర్యవేక్షణ చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వ్యాలు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందింప చేసేందుకు ప్రభుత్వం 'లిప్' కార్యక్రమం ప్రారంభించింది. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లాలో 20 పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసింది.

ప్రశ్న. ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు నాడు - నేడు పథకంలో మొదటి విడతలో ఎన్ని పాఠశాలల్లో పనులు నిర్వహించారు. ఎంత మేరకు నిధులు ఖర్చు చేశారు..?

జవాబు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు - నేడు పనులు మొదటి విడత పనులు విజయవంతంగా పూర్తి చేశాం. జిల్లాలో 861 పాఠశాలలను ఎంపిక చేసి పనులు పూర్తి చేసేందుకు రూ.260 కోట్ల నిధులు ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్మాణం, ప్రహరీ గోడ నిర్మాణం, అదనపు తరగతి గదుల నిర్మాణం వంటివాటితో పాటు ఆర్ఒ సిస్టమ్, విద్యుత్తు సౌకర్యం, పెయింటింగ్, గ్రీనరీ బోర్డులు ఏర్పాటు చేశాం. మొదటి ఫేజ్‌లో పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో నూటికినూరు శాతం పనులు పూర్తి చేశాం.

ముఖాముఖి

ప్రశ్న. నాడు - నేడు సెకండ్ పేజ్ కింద ఎన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు.. ఎస్టిమేషన్లు ఎంత వేశారు. ప్రభుత్వం అడ్వాన్స్‌గా ఎంత నిధులు విడుదల చేసింది..?

జవాబు. నాడు - నేడు సెకండ్ ఫేజ్ కింద జిల్లా వ్యాప్తంగా 1356 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. ఈ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.460 కోట్లు నిధులు కేటాయింపులు చేసింది. ఈ నిధులతో పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ గోడలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. నాడు నేడు సెకండ్ ఫేజ్ పనులు పాఠశాలలతోపాటు జిల్లాలోని 22 కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంది. నాడు - నేడు సెకండ్ ఫేజ్ -ఎ కింద అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు, ఫర్నిచర్ ఏర్పాటుకు, అధనపు తరగతి గదుల నిర్మాణానికి, ఫౌండేషన్ పాఠశాలల నిర్మాణానికి రూ.13 లక్షల మేరకు నిధులు కేటాయించింది. జిల్లాలో నాడు - నేడు సెకండ్ ఫేజ్ పనులు 75 శాతం పూర్తయ్యాయి. మిగిలిన 25శాతం పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.


సిపిఎం కార్యాలయంలో నాయకులు

బట్టేపాడులో సిపిఎం శాఖ మహాసభ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని బట్టేపాడు గ్రామంలో ఆదివారం బట్టేపాడు సిపిఎం శాఖ మహాసభను నిర్వహించారు. ఈ మహాసభలలో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంట లక్ష్మీపతి, బట్టేపాడు సిపిఎం నాయకులు బలరాం, పెంచలయ్య, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు భారత్ సేవారత్న అవార్డు

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని అంతిమతీర్పు పత్రిక రిపోర్టర్ ఎం.కృష్ణ కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో శనివారం జాకూర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సముదాయ భవనంలో సోమలరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12వ వార్షికోత్సవ సందర్భంగా చైర్మన్ శివరాజు చేతుల మీదుగా విశిష్ట భారత్ సేవారత్న అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రిపోర్టర్ ఎం.కృష్ణ మాట్లాడుతూ భారత్ సేవారత్న అందజేసిన సోమలరాజు ఫౌండేషన్ కు ధన్యవాదాలు తెలియజేశారు.


ఎంఎల్ఎకు చెక్కును అందజేసిన కొలకలపూడి బ్రహ్మారెడ్డి

ఎంఎల్ఎకు రూ.లక్ష అందజేత

ప్రజాశక్తి-జలదంకి

వరద బాధితుల సహాయార్థం సిఎం సహాయనిధికి ఎస్ఎల్ఎన్ మార్కెటింగ్ ప్రయివేట్ లిమిటెడ్ ఎమ్‌డి కొలకలపూడి భవాని చీఫ్ అడ్వైజర్ కొలకలపూడి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఎంఎల్ఎకు కాకర్ల సురేష్‌కు లక్ష రూపాయల విరాళం చెక్కును అందజేశారు. వింజమూరులోని టిడిపి ప్రధాన పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ లేఅవుట్ బిజినెస్‌లో అంచలంచెలుగా ఎదుగుతూ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నామని, విజయవాడ నగరానికి జరిగిన నష్టం పూడ్చటం సాధ్యతరం కాదన్నారు. పది రోజులపాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రమించి ఆకలి చావులు లేకుండా మంచినీరు ఆహారం అందించి వారి పాలిట ఆపద్బాంధవుడు అయ్యారని తెలిపారు. ఎంఎల్ఎ కాకర్ల సురేష్ వారం రోజులపాటు సహాయక కార్యక్రమాలలో పాల్గొని పనులను పర్యవేక్షించి సహాయక కార్యక్రమాలు వేగవంతంగా జరిగేలా సత్తా చాటారని తెలిపారు. ఉడతా భక్తిగా ఈ సహాయాన్ని అందజేశామని వారన్నారు. కార్యక్రమంలో వేల్పుల ధనుంజయ్య, వింజమూరు ఎస్ఎల్ఎన్ బ్రాంచ్ మేనేజర్ ఎం.గోవర్ధన్, వేల్పుల వేణుగోపాల్, వింత చైతన్య కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో యుటిఎఫ్ విజయం

ప్రజాశక్తి-ఉదయగిరి

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఆటల పోటీలలో ఉదయగిరి యుటిఎఫ్ జట్టు విజయం సాధించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, రన్నింగ్ రేస్, జావెలిన్ త్రో తదితర పోటీలు నిర్వహించారని ఈ పోటీల్లో వాలీబాల్ క్రీడా విభాగాల్లో ఆత్మకూరు ఉదయగిరి ఉపాధ్యాయ జట్లు ఫైనల్లో తలపడడంతో ఉదయగిరి యుటిఎఫ్ మండల శాఖ విజయం సాధించి జిల్లాలో తన సత్తా చాటడంతో సంబరాలు జరుపుకున్నట్లు వారు తెలిపారు.

ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం


ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండల పరిధిలోని అప్పారావుపాళెం గిరిజన కాలనీలో ఆదివారం కడప జిల్లా, ఉడుమువారిపల్లికి చెందిన "ఈగ శ్రీనివాసులు రెడ్డి మొదటి వర్ధంతి" సందర్భంగా ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ప్రతినిధులు, గిరిజనులు శ్రీనివాసులు రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐక్య ఫౌండేషన్ చైర్మన్ పయ్యావుల రామకృష్ణ చౌదరి మాట్లాడుతూ ఈగ పృథ్వీధర్ రెడ్డి, ఈగ ప్రభుధర్ రెడ్డి, కుటుంబ సభ్యుల సహకారంతో "ఐక్య ఫౌండేషన్" ఆధ్వర్యంలో 120 మంది పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. "అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని" సమయానికి ఆహారం దొరకక ఎంతోమంది ఆకలి బాధతో అలమటిస్తున్నారని అలాంటి వారికి అన్నదాన కార్యక్రమం ద్వారా ఆకలి బాధ తీర్చడం అనేది శుభపరిణాయమని ఆ కుటుంబ సభ్యులకు ఐక్య ఫౌండేషన్, గిరిజనుల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐక్య ఫౌండేషన్ చైర్మన్ పయ్యావుల రామకృష్ణ చౌదరి, ఐక్య ఫౌండేషన్ రాష్ట్ర డైరెక్టర్ పయ్యావుల మారుతినాయుడు, ఈగ ప్రభావతమ్మ, కామాక్షయ్య, పావని, యశ్వంత్, సాయి, రిషిత, సునీల్, అక్షిత్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దగదర్తి - బుచ్చి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-దగదర్తి

దగదర్తి - బుచ్చిరెడ్డిపాలెం రోడ్డు పనులు ఆదివారం పున:ప్రారంభమయ్యాయి. కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి అశేష జనవాహిని మధ్య కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు దగదర్తిలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ గత వైసిపి పాలనలో రోడ్లు నిర్వీర్యం అయ్యాయన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల లోపే కావలి - తుమ్మలపెంట, దగదర్తి - బుచ్చిరెడ్డిపాలెం రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అక్టోబర్ 2వ తేదీన ఇసుకపల్లి - రాజుపాలెం రోడ్డును కూడా ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామాలను అనుసంధానం చేస్తూ లింక్ రోడ్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. డిఎం, డిఆర్ ఛానల్ పనులను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. దగదర్తిలో టిడిపి కార్యాలయం ఏర్పాటు చేయబోతున్నామని, మండలంలోని ప్రతిఒక్కరీ సమస్యలు అక్కడే పరిష్కరిస్తామన్నారు. వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చిన వారికి పార్టీ కార్యాలయం నీడను కూడా కల్పిస్తుందని తెలిపారు. త్వరలో దామవరం ఎయిర్ పోర్టు పనులు ప్రారంభం అవుతాయన్నారు. రామాయపట్నం పోర్ట్ అనుసంధానంగా త్వరలో పారిశ్రామికవాడ ఏర్పాటు కానుందని, 40వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయని తెలిపారు. ప్రతిఒక్కరినీ కాపుగాస్తానని, ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎంఎల్ఎ తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, దగదర్తి మండల అధ్యక్షులు అల్లం హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి చేజర్ల ఇబ్రిన్, జలదంకి శ్రీహరి నాయుడు, పులి సీనయ్య, మల్లికార్జున్ రెడ్డి, చెన్నూరు సర్పంచ్ నాయక్, రెడ్డిమాచి రవీంద్ర, శేషారెడ్డి, ప్రతాప్, జనసేన నాయకులు వెంకట్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి

సీతారాం ఏచూరికి నివాళులు

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు సీతాపోలయ్య భవనంలో ఆదివారం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ నిర్వహించారు. ఈ సభకు షేక్.అఫ్రోజ్ అధ్యక్షన వహించారు. జిల్లా సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం భారత వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అన్నారు. రాజకీయాల్లో మహోన్నత వ్యక్తి అని పార్లమెంటులో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో దిట్ట అని కొనియాడారు. టిడిపి జిల్లా నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ అన్ని పార్టీలు రాజకీయాల అతీతంగా ప్రేమించే వ్యక్తి అని ఆయన మరణం సమాజానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో గండవరపు శేషయ్య, ప్రజా నాట్యమండలి విజయ్‌కుమార్, జక్కా శేషమ్మ, బుజ్జయ్య, బాబు, సుబ్బారావు, పెద్దన్న, శ్రీనివాసులు, రమేష్, సురేష్, విజయకుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు


18, 19 డివిజన్ లో ఏచూరికి నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి 18, 19 డివిజన్ల సిపిఎం, సిఐటియు, మహిళా సంఘం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య మాట్లాడారు. సిపిఎం 18, 19 డివిజన్ జనరల్ కార్యదర్శి టి. కుమార్, మహిళా శాఖ కార్యదర్శి కామ్రేడ్ జానకమ్మ, టి. శ్రీనివాసులు, యానాద్ రెడ్డి, వెంకయ్య, రవి, భద్రయ్య, రత్నమ్మ, సుజాతమ్మ, పి.శ్రీనివాసులు, తదితర నాయకులు, కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

పొగాకు రైతుల శ్రేయస్సే లక్ష్యం

ప్రజాశక్తి-మర్రిపాడు

పొగాకు రైతుల అభివృద్ధి, శ్రేయస్సే ప్రధాన లక్ష్యమని, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పొగాకు బోర్డు నిరంతరం కృషి చేస్తుందనిలో వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ పేర్కొన్నారు. పొగాకు ముగింపు అనంతరం ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సంతోషంగా ఉన్నప్పుడే దేశం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందన్నారు. గడచిన సంవత్సరాల కన్నా ఈ ఏడాది పోగాకుకు అత్యధికరేటు రాగా, లోగ్రేడ్ పొగాకుకు సైతం రూ.200 ధర లభించడం హర్షణీయన్నారు. రైతులు పండించిన అధిక పొగాకుపై జరిమానాలు విధించకుండా అమ్మకాలు జరిపామన్నారు. బోర్డు అనుమతించిన మేరకే నాణ్యమైన పొగాకును పండిస్తే అధిక ధరలు వస్తాయని తెలియజేశారు. అనంతరం డిసిపల్లి పొగాకు బోర్డు రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు మూలి వెంగయ్యను వేలం నిర్వహణ అధికారి, బోర్డు సిబ్బంది, రైతులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన సంవత్సరాలలో రైతులు పండించిన పొగాకుకు మద్దతు ధర లేక పెట్టిన పెట్టుబడులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గత ఏడాదికన్నా ఈ ఏడాది నాణ్యమైన పొగాకు పంటకు లోగ్రేడ్ పొగాకుకు రేటు లభించిందన్నారు. గత ఏడాది సగటు ధర రూ.208.79రాగా ఈ ఏడాది సగటు ధర రూ.253.41 లభించిందన్నారు. అన్ని పంటలకు ఇచ్చిన మద్దతు ధరను పొగాకు పంటకు కూడా మద్దతు ధర లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోవు కాలంలో పొగాకుకు మద్దతు ధర లభించేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గాలి నరసప్ప నాయుడు, శాఖమూరి నారాయణ, దామా సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మూలి వెంగయ్య



గ్రామ పొంగళ్లు

ప్రజాశక్తి-ఉదయగిరి

గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి బిసి కాలనీ గ్రామప్రజలు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి గ్రామ సమస్యలను తీర్చాలని మొక్కుకున్నారు. ఆదివారం మండల పరిధిలోని కుర్రపల్లి బిసి కాలనీ గ్రామస్తులు గ్రామాన్ని చీడపీడల నుండి కాపాడాలని ఈ ఏడాదైనా గ్రామాన్ని గ్రామ ప్రజలను రక్షించాలని పోలేరమ్మ వారి మొక్కులను తీర్చాలని పెద్ద ఎత్తున మహిళలు గ్రామస్తులు గ్రామం నుండి డబ్బు వాయిద్యాలు బాణాసంచారాలతో గుడి వద్దకు చేరుకొని పొంగళ్లను పొంగించారు. అనంతరం నైవేధ్యాన్ని అమ్మవారికి సమర్పించి కాయకర్పూరం వెలిగించి గ్రామాన్ని చల్లగా చూడాలని పాడి పంటలు బాగా పండాలని సకాలంలో వర్షాలు సమృద్ధిగా పడాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.



ప్రమాదరకరంగా వెల్లంటి రోడ్డు

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ మండలంలోని ములుమూడి గ్రామం నుంచి వెల్లంటి వరకు ఉన్న రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. వాహనదారులు సైతం రోడ్డుపై ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులైతే వాహనాలు పంక్చర్లు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మించాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వ హయాంలో రోడ్డునిర్మాణం చేపట్టాలని కోరుతున్నట్లు ప్రజలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

విట్స్‌లో ముగిసిన సిల్వర్ జూబ్లీ

ప్రజాశక్తి-కావలి

స్థానిక విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న " విశ్వోత్సవ్ - 2024" సిల్వర్ జూబ్లీ సంబరాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ప్రిన్సిపల్ డాక్టర్ శేషయ్య ఈ సందర్భంగా "జూక్ బాక్స్"ను ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్‌కు ళాశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటు, అక్కడ ఏర్పాటు చేసిన వివిధ ఆహారం ప్రదర్శన స్టాల్స్‌లో ఉన్న ఆహార పదార్థాలను ఆరగిస్తూ గడిపారు. సాయంత్రం జరిగిన ముగింపు సభలో ముఖ్య అతిథిగా అనంతపూర్ జె.ఎన్.టి.యు. వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ " సుదర్శనరావు, గౌరవ అతిథిగా యాష్ టెక్నాలజిస్ జనరల్ మేనేజర్ రష్మీరంజన్ పాల్గొని, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రిన్సిపల్ డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ 25 యేళ్లలో కళాశాలలో సాధించిన ఘనవిజయాలను వివరించారు. విద్యార్థులను అకడామిక్‌గా మరింత ముందుకు తీసుకు పోయేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కళాశాల చైర్మన్ దొడ్ల విద్యాధరకుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకు తగినట్లుగా విద్యార్థులకు తగిన వసతులు కల్పిస్తున్నట్లు విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కళాశాలలోని విద్యార్థులు పరిశోధనా పరంగా ఎంతో ప్రగతి సాధించారని కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డి.ప్రత్యూష రెడ్డి అన్నారు. అకాడమిక్‌గా బోధనాంశాలను శంకలనం చేయడం, నాణ్యతను పెంపొందిచడం కోసం అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని అకాడమిక్ ఇన్‌ఛార్జి డి.లిఖిత్‌రెడ్డి తెలిపారు. ఈ సిల్వర్ జూబ్లీ ముగింపు కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీనాథ్ రెడ్డి, వి.వి. సునీల్, డాక్టర్ కె.వి.సుబ్బయ్య, ఎ.ఒ. కె.రామకృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


డిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం